ఈ-క్రాప్.. రైతు సేవలో భేష్

నమోదుకు సెప్టెంబర్ 15 వరకు గడువు

భీమవరం అర్బన్: రైతు బాగుంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని భావించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు సంక్షేమానికి, వ్యవసాయానికి పెద్దపీట వేస్తున్నారు. సాగు ప్రయోజనాలు సక్రమంగా అందించేందుకు ప్రవేశపెట్టిన ఈ-క్రాప్ విధానం రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. ఆరుగాలం శ్రమించే కర్షకులకు మరింత మేలు చేసే విధంగా ఆర్‌బీకే సెంటర్లో కియోస్క్ ద్వారా నాణ్యమైన ఎరువులు, పురుగుమందులను, సబ్సిడీ విత్తనాలను బుక్ చేసుకున్న 48 గంటల్లో అందజేసే విధంగా చర్యలు తీసుకున్నారు.

ఈ-క్రాప్ నమోదుతో ప్రయోజనాలెన్నో..

పంటల బీమా, నష్టపరిహారం చెల్లింపు, పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం, అందుబాటులో ఎరువులు, పురుగుమందులు, పెట్టుబడి సాయం అందించడం, వైఎస్సార్ యంత్ర సేవా పథకం అమలు, సున్నా వడ్డీ పంట రుణాలు అందించడం, మెట్టలో ఉచిత విద్యుత్, ఉచిత బోర్లు ఇలా ఎన్నో రైతుల సంక్షేమానికి రూపొందించిన పథకాలు ఈ-క్రాప్ నమోదుతో సులభంగా అందుతాయి. ఈ-క్రాప్‌లో భాగంగా ఆర్‌బీకే స్థాయిలో ప్రతి రైతు వివరాలు నమోదు చేస్తున్నారు. దీని వల్ల పంట అమ్ముకునే సమయంలో రైతులకు ఏ విధమైన ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా మూడేళ్లుగా పంటల బీమాను రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నారు.

ఆర్‌బీకేల్లో నమోదు

ఈ-క్రాప్‌లో భాగంగా రైతులు, కౌలు రైతులు తమ పేర్లను రైతు భరోసా కేంద్రంలో నమోదు చేయించుకోవాలి. అనంతరం ఆయా ప్రాంతాల్లో రైతుల సాగు విధానాన్ని వ్యవసాయాధికారులు పరిశీలించి పంట వివరాలు నమోదు చేస్తారు. ఈ-క్రాప్‌లో పంట వివరాలను సెప్టెంబర్ 15 లోగా నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారులు రైతులకు సూచిస్తున్నారు. భీమవరం మండలంలో 13 వ్యవసాయాధారిత గ్రామాల్లోని 7 వేల ఎకరాల్లో రైతులు సార్వా సాగు చేపట్టారు. ఏటా భారీ వర్షాలు, తుపానుల వల్ల కొన్ని ప్రాంతాలలో పంట దెబ్బతినే పరిస్థితులు నెలకొంటున్న నేపథ్యంలో రైతులు తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకుంటే ఎంతో మేలు చేకూరుతుంది.



రాయలంలో ఓ రైతుకు చెందిన పొలంలో పంట వివరాలను నమోదు చేస్తున్న సిబ్బంది

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి



ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట దెబ్బతింటే ఈ-క్రాప్ నమోదుతో పంట నష్టపరిహారం నేరుగా రైతు ఖాతాలో జమ చేస్తున్నారు. ఈ విధానం వల్ల ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి పథకం రైతులకు చేకూరుతుంది. కాళ్లు అరిగేలా వ్యవసాయ శాఖ కార్యాలయం చుట్టూ తిరిగే పని ఉండదు. ప్రభుత్వం ఇచ్చే ప్రతిఫలం పక్కాగా రైతులకు అందుతుంది.

– కొట్టి కుటుంబరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి డైరెక్టర్, బేతపూడి

రైతులకు ఎంతో మేలు



ఈ-క్రాప్ నమోదు వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ప్రతి రైతు పండిస్తున్న పంట వివరాలను తప్పకుండా నమోదు చేయించుకోవాలి. ఈ-క్రాప్ నమోదు సెప్టెంబర్ 15 వరకు మాత్రమే నమోదు చేస్తారు. ఇప్పటికే మండలంలో 1500 ఎకరాల్లో పంటల వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేశాం. మిగిలిన పంటల వివరాలను రైతులు త్వరగా నమోదు చేయించుకోవాలి.

– నిమ్మల శ్రీనివాస్, మండల వ్యవసాయాధికారి, భీమవరం

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కాళ్ల : చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. కాళ్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఎల్ఎన్ పురం గ్రామానికి చెందిన ఎం.జాన్‌బాబు (33), అతని భార్య విబేధాల నేపథ్యంలో గత ఆరేళ్లగా విడిగా ఉంటున్నారు. ఈ క్రమంలో అతనికి పక్షవాతం వచ్చి కాలు, చేయి పనిచేయక ఇబ్బంది పడుతున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసైన జాన్‌బాబు మనస్తాపంతో ఈ నెల 18న కూల్ డ్రింక్‌లో కలుపుమందు కలుపుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతనిని భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తల్లి సత్యవతి ఫిర్యాదు మేరకు ఎస్సై ఏజీఎస్ మూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్య కనిపించడం లేదని భర్త ఫిర్యాదు

పాలకోడేరు : తన భార్య, చిన్నకుమారుడు అదృశ్యంపై పెన్నాడ గ్రామానికి చెందిన అయినవల్లి ప్రతాప్ పాలకోడేరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల ప్రకారం ప్రతాప్‌కు, దీపికతో ఏడు సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. ప్రతాప్ ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 19వ తేదీన మధ్యాహ్నం మూడు గంటలకు తాను ఇంట్లో లేని సమయంలో చిన్న కుమారుడు హర్షిత్ (3) తో కలసి తన భార్య ఇంటి నుంచి వెళ్లిపోయిందని, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకి దొరకలేదని ప్రతాప్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు.

వాహనం ఢీ : వ్యక్తికి గాయాలు

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో వ్యక్తి తీవ్రగాయాలయ్యాయి. తాడేరు గ్రామానికి చెందిన బండారు గిరి వెంకటరావు పాల ప్యాకెట్లు కొనుగోలుచేసి ఇంటికి వస్తుండగా వెనుక నుంచి వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. వెంకటరావు కాలికి తీవ్ర గాయమైంది. ఆయన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు హెడ్ కానిస్టేబుల్ ఉమామహేశ్వరరావు తెలిపారు.

బాలిక అదృశ్యం

వీరవాసరం: బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేశామని ఎస్సై పి.రమేష్ మంగళవారం తెలిపారు. కమతాలపల్లి గ్రామానికి చెందిన బాలిక ఈనెల 19 నుంచి కనిపించడం లేదని ఆమె తండ్రి లాజరు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టామన్నారు.

రేలంగిలో...

ఇరగవరం: మైనర్ బాలిక కనిపించడం లేదన్న తాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కె చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. రేలంగి గ్రామానికి చెందిన మైనర్ బాలిక కనిపించడం లేదని తాత వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేశారన్నారు. ఈనెల 16వ తేదీ మనువరాలు కనిపించడం లేదని, చుట్టుపక్కల గ్రామాలు, బంధువుల ఇళ్లకు వెళ్లి ఆరా తీయడం జరిగిందన్నారు. బాలిక ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

క్లుప్తంగా

ఉచిత గుండె వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశంచౌక్): స్థానిక మెంటేవారి తోటలోని అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ వైద్య సహాయ కేంద్రం (సుందరయ్య భవనం)లో మంగళవారం ఉదయం గుండె సంబంధిత వ్యాధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పెద్దలకు స్థానిక తేజ హాస్పిటల్ అధినేత, కార్డియో థొరాసిక్ సర్జన్ పొనమండ చంద్రశేఖర వర్మ, 15 ఏళ్లలోపు పిల్లలకు విజయవాడ ఆంధ్రా హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ కె.విక్రమ్ వైద్య సేవలు అందించారు. పెద్దలు 10 మంది, పిల్లలు 20 మందికి ఈసీజీ, ఎకో, 2డి ఎకో పరీక్షలు చేశారు. వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు, వసుధ కోఆర్డినేటర్ ఎంవీ రామరాజు, అల్లూరి ట్రస్టీ బి.బలరాం, ఎస్ఎల్‌జీ హాస్పిటల్స్ ప్రతినిధి వై.రణదివే తదితరులు పాల్గొన్నారు.

నేరాల అదుపునకు ప్రత్యేక డ్రైవ్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ సత్యనారాయణ, ఎస్సై ఫణిమోహన్

ఆకివీడు : పట్టణంలో, మండలంలో దొంగతనాలు, చట్ట వ్యతిరేక కార్యక్రమాల్ని అరికట్టేందుకు ఆకివీడు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు రూరల్ సీఐ కేవీవీఎన్ సత్యనారాయణ, ఎస్సై ఏ ఫణిమోహన్ చెప్పారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. నేరాల్ని అరికట్టేందుకు పోలీస్ నైట్ బీట్‌లు, సీసీ కెమెరాలు, సచివాలయ పోలీస్ యంత్రాంగం సహకారంతో ముందుకు వెళ్తున్నామని చెప్పారు. పట్టణంలో గంజాయి వినియోగం, ఆకతాయిల బెడద, దొంగతనాలు జరుగుతున్న దృష్ట్యా ప్రత్యేక నిఘాతో వీటిని అరికడతామన్నారు. యువత చెడు వ్యసనాలకు వెళ్లకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. తమ పిల్లలు చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారని తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే అటువంటి వారికి కౌన్సిలింగ్ ఇస్తామన్నారు. గంజాయి అమ్మకం, కొనుగోలు, రవాణ వంటివి చేపట్టినా, వాటికి సహకరించిన వ్యక్తులకు జరిమానాలు, శిక్షలు కఠినంగా ఉంటాయని సీఐ సత్యనారాయణ, ఎస్సై మోహన్ హెచ్చరించారు.

మణిపూర్ హింసాకాండ బాధాకరం



గొల్లలకోడేరులో మోకాళ్లపై ప్రార్థన చేస్తూ నిరసన తెలుపుతున్న క్రైస్తవులు

పాలకోడేరు : మణిపూర్‌లో జరిగిన హింసాకాండను నిరసిస్తూ పాలకోడేరు మండల యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో యూపీఏ ప్రెసిడెంట్ గోపి సాల్మన్ రాజు అధ్యక్షతన పాలకోడేరు, గొల్లలకోడేరు గ్రామాల్లో మంగళవారం శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సాల్మన్ రాజు మాట్లాడుతూ మణిపూర్‌లో జరిగిన ఘటనలు బాధాకరమని, అటువంటి అల్లర్లు దేశవ్యాప్తంగా ఎక్కడా పునరావృత్తం కాకుండా చూడాలని కోరారు. ఆర్‌సీఎం ఫాదర్ తోట గాబ్రియేలు, బిషప్ మీకా, బిషప్ సత్యం, శ్యాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వాలు స్పందించి శాంతి భద్రతలను కాపాడి బాధితులకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. వై.జయరాజు, సుధాకర్ బాబు, పద్మాస్ కుమార్, గోపి భాగ్యరాజు, విజయ్‌కుమార్, యోహాను, సారి చటర్జీ, ప్రసాదు జయప్రసాద్ క్రిస్టాఫర్, విశ్వాసులు పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్ షేక్ హుస్సేన్‌కు వినతిపత్రం సమర్పించారు.

పాలిటెక్నిక్ విద్యార్థులకు అభినందన



కయాకింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: రాష్ట్ర స్థాయి కయాకింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో స్థానిక సీత పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ జీవీఎస్ కుమార్‌రాజు చెప్పారు. మంగళవారం కళాశాలలో విద్యార్థులను అభినందించారు. ఈనెల 20న ఎన్‌టీఆర్ జిల్లా పున్నమి ఘాట్, కృష్ణా రివర్‌లో ఎన్‌టీఆర్ జిల్లా కయాకింగ్ అసోసియేషన్ నిర్వహించిన 500 మీటర్ల డబుల్స్ పోటీల్లో టి.హేమంత్, ఎస్ఎస్‌వీ శ్రీకాంత్ పాల్గొన్నారని పీడీ కుమర్‌రాజు తెలిపారు. హేమంత్ తృతీయ స్థానం సాధించాడని, వచ్చేనెల 14 నుంచి నాలుగు రోజులపాటు ఉత్తరాఖండ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాడని చెప్పారు. హేమంత్, శ్రీకాంత్‌లను కళాశాల డైరెక్టర్ దాశిక సూర్యనారాయణ, ప్రిన్సిపాల్ డీవీ సుబ్బారావు, కుమార్‌రాజు అభినందించారు.

నేడు ఆకివీడులో గడపగడపకు

ఆకివీడు : స్థానిక నగర పంచాయతీ పరిధిలోని 20వ వార్డులో బుధవారం ఉదయం 8 గంటల నుంచి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ కృష్ణమోహన్ మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి డీసీసీబీ చైర్మన్ పీవీఎల్.నర్సింహారాజు, నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, కౌన్సిలర్లు హాజరవుతారని, వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తప్పక పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

చంద్రయాన్-3 విజయవంతం కావాలని ప్రత్యేక పూజలు

తాడేపల్లిగూడెం: చంద్రయాన్-3 విజయవంతం కావాలని కోరుతూ మంగళవారం శంకరమఠంలో ఉమాచంద్ర మౌళీశ్వరస్వామి, సర్వమంగళ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. 142 కోట్ల భారతీయుల ఆకాంక్ష నెరవేరాలని, దేశం ప్రపంచానికి ఆదర్శం కావాలని కోరుతూ పూజలు చేశారు. కార్యక్రమంలో గరికపాటి బాపయ్యశర్మ, ధూళిపాళ ఆదిత్య, వేమూరి సుబ్రహ్మణ్యశాస్త్రి పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమం.. జగనన్న లక్ష్యం

ఉండి : ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, జెడ్పీటీసీ రణస్తుల కనకదుర్గ అన్నారు. మంగళవారం ఉండి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ ఎలక్ట్రికల్ ఏఈగా ఎంపికైన ఎం.మాధవరాజు, ఆకివీడు సీఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సత్యనారాయణలను ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఎంపీపీ, జెడ్పీటీసీ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు ప్రభుత్వ ఉద్యోగులపై దాడులు చేసినా, నీచంగా మాట్లాడినా అడిగే నాథుడే లేడన్నారు. కానీ జగనన్న ప్రభుత్వంలో సంక్షేమ పాలన విజయంలో అహర్నిశలు శ్రమిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు మంచి చేసేందుకు సీఎం వైఎస్ జగన్ ఎప్పుడూ ముందుంటున్నారని అన్నారు. డీఏలు అందించడం, ఉద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా వారికి కావలసిన సౌకర్యాలు సమకూర్చడం రాష్ట్ర ప్రభుత్వం చేస్తుందన్నారు.



ఎలక్ట్రికల్ ఏఈ, ఆకివీడు నూతన సీఐలను సత్కరిస్తున్న దృశ్యం

అనంతరం మండలంలోని అన్ని శాఖల పనితీరుపై ఆరా తీశారు. ముఖ్యంగా విద్యాశాఖ మరింత మెరుగ్గా పనిచేసి డ్రాప్ అవుట్స్ లేకుండా చూడాలన్నారు. తాగునీటి కాలుష్యం, పశు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. అలాగే ప్రధాన సెంటర్లలో ఉండి రైల్వేగేట్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. వివిధ గ్రామాల్లో అవసరమైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాల ఏర్పాటు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఏవీ అప్పారావు, వైస్ ఎంపీపీలు గుత్తుల కనక మహాలక్ష్మీ, దత్తాల సుజాతరాణి, ఎస్సై కె.గంగాధరరావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

జాతీయ అవార్డుకు విస్సాకోడేరు ఎంపిక గర్వకారణం



విస్సాకోడేరు సర్పంచ్ బొల్లా శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్, ఎంపీపీ చంటిరాజు

- డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు
- విస్సాకోడేరు సర్పంచ్ శ్రీనివాస్‌కు సత్కారం

పాలకోడేరు : దేశంలో ఆరు పంచాయతీలు జాతీయ అవార్డుకు ఎంపిక కాగా మన రాష్ట్రంలో ఉండి నియోజకవర్గం నుంచి విస్సాకోడేరు గ్రామం ఎంపిక కావడం గర్వకారణం అని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహారాజు అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో విస్సాకోడేరు సర్పంచ్ బొల్లా శ్రీనివాస్‌కు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ భూపతి రాజు చంటి రాజు అధ్యక్షతన జరిగిన ఈ సభలో పీవీఎల్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామంలో డంపింగ్ యార్డు ప్రాజెక్ట్ డీపీఆర్‌సీ కోఆర్డినేటర్ ఎడ్వర్డ్ సలహాలు సూచనలు తీసుకుని, గ్రామంలో పారిశుధ్య ప్లాంట్, వర్మి కంపోస్ట్ తదితర యార్డులను నిర్వహించడం జరిగిందన్నారు. గ్రామాభివృద్ధికి పాటు పడినందువల్లనే అవార్డు రావడం జరిగిందన్నారు. మిగిలిన సర్పంచ్‌లు కూడా గ్రామాలను అభివృద్ధి చేయాలని, అందుకు తన వంతు సహకారం అందిస్తానని పీవీఎల్ హామీ ఇచ్చారు. ఎంపీపీ భూపతిరాజు సత్యనారాయణరాజు (చంటి రాజు) మాట్లాడుతూ మౌలిక వసతుల కల్పన, గ్రామాభివృద్ధి, పర్యావరణం పరిరక్షణ తదితర అంశాలలో మెరుగుపరిచే విధంగా ఉండటం వల్ల రాజీవ్ గాంధీ నేషనల్ మెమోరియల్ అవార్డుకు ఈ గ్రామం ఎంపికైందన్నారు. అనంతరం సర్పంచ్ శ్రీనివాసును దుశ్శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు భూపతిరాజు వంశీకృష్ణంరాజు, కొత్తపల్లి కాశీ విశ్వనాధరాజు వైస్ ఎంపీపీ ఆధాడ లక్ష్మి తులసి, పిన్నమరాజు సహదేవరాజు, శ్రీనివాసరాజు, సర్పంచ్‌లు నాగేశ్వరి, మరియమ్మ, సూరిబాబు, చిల్లా అనూష, చెల్లబోయిన పాపారావు, ఎంపీటీసీలు, ఎంపీడీవో నూకల మురళి గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

తణుకు టౌన్: ప్రజలందరూ పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తణుకు మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ జీ వెంకటేశ్వరరావు చెప్పారు. మంగళవారం తణుకు పైడిపర్రు, వెంకట్రాయపురం, వీరభద్రపురం, కొమ్మయిచెరువు గట్టు తదితర సచివాలయాల పరిధిలో పర్యటించి సిబ్బంది వెక్టార్ కంట్రోల్ హైజీన్, దోమల లార్వా డెన్సిటీ, కీటక జనిత వ్యాధుల నివారణపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల ఉత్పత్తి స్థావరాలైన చిన్న చిన్న నీటి నిల్వలను ఎప్పటికప్పుడు తొలగించుకోవాలన్నారు. ముందస్తు జాగ్రత్తలు పాటించడం ద్వారా రక్షణ పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సెక్రటరీలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశ కార్యకర్తలు, తదతరులు పాల్గొన్నారు.

కంటి వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



గొల్లవానితిప్ప పీహెచ్‌సీలో కంటి వైద్య పరీక్ష చేస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: కళ్లకు సోకే వ్యాధుల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండి వైద్యం చేయించుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారిని సీహెచ్ ధనలక్ష్మి అన్నారు. భీమవరం మండలం గొల్లవానితిప్పలో కొప్పర్తి వీరాస్వామి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. ఆప్తామిక్ అధికారి బి.రామకృష్ణ 65 మందికి కళ్ల పరీక్షలు నిర్వహించారు. వీరిలో కంట్లో శుక్లాలు ఉన్న 13 మందిని శస్త్ర చికిత్స కోసం ఏలూరులోని శంకర్ నేత్రాలయకు పంపించనున్నారు. మిగిలిన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారిని ధనలక్ష్మి మాట్లాడుతూ 60 సంవత్సరాలు పైబడిన వారు తరచూ కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం ద్వారా గ్రామాల్లో క్యాంపులు నిర్వహిస్తున్నామని, అవసరమైన వారికి ఉచితంగా కళ్ల జోళ్లు, మందులు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. కంటి శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి ఆరోగ్య శ్రీ ద్వారా చేస్తారని రవాణా ఖర్చులు, భోజన వసతి కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ బాలామణి, పీహెచ్ఎన్ పుష్పవతి, స్టాఫ్‌నర్స్ కె.ఉష, వి.శ్యామల, ఏఎన్ఎం వీవీ సత్యవతి, ఎంపీహెచ్ఓ రాము, ఆశా కార్యకర్తలు జ్యోతి, విజయకుమారి, కోటేశ్వరి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆశీస్సులు వైఎస్సార్ సీపీకి మెండు

ఆకివీడు : ప్రజల ఆశీస్సులు వైఎస్సార్ సీపీకి మెండుగా ఉన్నాయని, రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం ఖాయమని ఉండి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్.నర్సింహారాజు ధీమా వ్యక్తం చేశారు. స్థానిక నగర పంచాయతీ పరిధిలోని 1, 2వ వార్డుల్లో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవీఎల్‌కు ప్రజలు ఆత్మీయ స్వాగతం పలికారు. డంపింగ్ యార్డు సమస్యను పీవీఎల్ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే డ్రెయినేజీ, మంచినీటి సరఫరాను మెరుగుపరచాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం పీవీఎల్ మాట్లాడుతూ గత నాలుగు దశాబ్దాలుగా పేదల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉండి పోయిందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా అధికారం చేపట్టిన నాటి నుంచి ఈ నాలుగేళ్ల పరిపాలనలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి పేదల ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతున్నారని చెప్పారు. నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారని, పేదల ఆరోగ్యం కోసం ఆరోగ్య శ్రీ, ఫ్యామిలీ డాక్టర్ వంటివి అమలు చేస్తున్నారన్నారు. అలాగే గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయన్నారు. రైతు భరోసా కేంద్రం ఏర్పాటు చేసి అన్నదాతలకు అండగా నిలుస్తున్నారన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులకు నేరు సంక్షేమ పథకాలు అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎం చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పీవీఎల్ అన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, వైస్ చైర్మన్లు పుప్పాల పండు, వంగా జ్యోత్స్న, చీఫ్ విప్ పడాల శ్రీనివాసరెడ్డి, మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతి, త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ, సచివాలయ కన్వీనర్ శిరపు శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ అంబటి రమేష్, జీ.ధనరాజు, గుండా సుందరరామనాయుడు, ముస్లిం మైనార్టీ జిల్లా అధ్యక్షుడు ఎండీ.జహాంగీర్, మాదివాడ దేవస్థానం చైర్మన్ గునుకుల కొండయ్య, కౌన్సిలర్లు నిమ్మల నాగు, ఎండీ.జక్కీ, శ్రీహరి, రాజనాల పట్టాభి, షేక్ హుస్సేన్, కుంచాడ బాబ్జీ, అందే రాజబాబు, కేశిరెడ్డి దిలీప్, ఎండీ.మాబూ, అచ్చారావు, రంగరాజు, చిక్కాల చిన్నా, నాతిరెడ్డి అన్నవరం తదితరులు పాల్గొన్నారు.



2వ వార్డులో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్

వాండ్రంలో దళితుల నిరసన

ఉండి : వాండ్రంలో లూథరన్ చర్చ్‌పై దాడికి తెగబడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని లేకుంటే రోడ్లపై బైఠాయించి నిరసనలు తెలుపుతామని స్థానిక దళితులు అధికారులను డిమాండ్ చేశారు. మంగళవారం వాండ్రంలో చర్చ్ వద్ద దళితులు ప్రార్థనలు చేస్తూ నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు గరికిముక్కుల సామేలు, కోనాల రాజేంద్ర, విప్పర్తి మహేష్, పాము మధు, మంద వర్మ, బందుల ఇశ్రాయేలు, మందా రూబేన్, గోరింకల ఏసేబు మాట్లాడుతూ గ్రామంలో ఇరువర్గాలకు జరిగిన కొట్లాటలో పోలీసులకు ఫిర్యాదులు చేసుకున్నారన్నారు. అయితే మూకుమ్మడిగా చర్చ్‌పై దాడికి తెగబడాల్సిన అవసరం ఏం వచ్చిందని వారు ప్రశ్నించారు. దాడి విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసి మూడు రోజులైనా సరే ఇప్పటిరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. వెంటనే అధికారులు చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ విషయాన్ని రాష్ట్ర శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షుడు మేడిద జాన్సన్ దృష్టికి తీసుకువెళ్లామని వారంతా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అనంతరం ఏఐఎల్‌సీ సినడు(జిల్లా) అధ్యక్షుడు ఆనంద్‌కుమార్, ఏఐఎల్‌సీ కౌన్సిల్ సభ్యుడు పట్టా దేవరాజ్, యండగండి, ఉండి సర్పంచ్‌లు గోగులమండ చినకృష్ణమూర్తి, కమతం సౌజన్య బెనర్జీ, జీ సుందర్‌కుమార్ తదితరులు దళితులకు సంఘీభావం ప్రకటించారు.



చర్చిపై దాడి చేసిన వారిని శిక్షించాలంటూ ప్రార్థన చేస్తూ నిరసన తెలుపుతున్న దళితులు

డీఎస్పీ దర్యాప్తు

వాండ్రం చర్చ్‌పై దాడి ఘటనలో స్థానికుల ఫిర్యాదు మేరకు భీమవరం డీఎస్పీ కే శ్రీనాథ్ మంగళవారం దర్యాప్తు చేశారు. జరిగిన ఘటనపై ఆరా తీశారు. దాడికి ప్రయత్నించిన వారి వివరాలను ప్రత్యక్షసాక్షుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. దర్యాప్తు చేస్తున్నామని, పూర్తి కాగానే దోషులపై చర్యలు తీసుకుంటామని డీఎస్పీ వారికి తెలిపారు.